పీలేరు.. అభివృద్ధిలో సరిలేరు!

- ప్రగతి పథంలో పరుగులు తీస్తున్న పీలేరు
- ప్రారంభానికి సిద్ధమైన వంద పడకల ప్రభుత్వాస్పత్రి
- రూ. 120 కోట్లతో చురుగ్గా రెండు ఆర్‌ఓబీ నిర్మాణాలు
- పీలేరు మండలంలో 12వేల ఇళ్లు మంజూరు
- ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కృషితో ఊపందుకున్న అభివృద్ధి పనులు


ప్రారంభానికి సిద్ధమైన పీలేరు వందపడకల ఆస్పత్రి

పీలేరు : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రత్యేక కృషితో పీలేరు నియోజకవర్గం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోంది. ప్రధానంగా నియోజకవర్గ కేంద్రమైన పీలేరులో పలు అభివృద్ధి కార్యక్రమాలు జోరందుకున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పీలేరు రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. దీంతో ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న వందపడకల ఆస్పత్రి..

పీలేరు ప్రభుత్వాస్పత్రిని వంద పడకలు చేయాలని ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన ప్రజల చిరకాల వాంఛను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చింది. రూ. 24 కోట్లతో వందపడకల ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. ఆస్పత్రి భవనంతోపాటు పార్కు, క్యాంటిన్, అత్యాధునిక సౌకర్యాలతో త్వరలో వంద పడకలు అందుబాటులోకి రానున్నాయి. అలాగే రూ. 90 లక్షలతో స్థానిక ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో జగనన్న ప్రాణవాయువు ఏర్పాటు చేశారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ఆక్సిజన్ సమస్య తలెత్తకుండా ఇది ఉపయోగపడుతుంది. వంద పడకల ఆస్పత్రికి సరిపడా వంద ఆక్సిజన్ సిలిండర్లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. పీలేరు ఆస్పత్రికి ట్రామా కేర్ సెంటర్‌కు ప్రతిపాదనలు పంపారు.

రూ. 120 కోట్లతో ఆర్‌ఓబీ పనులు..

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి పీలేరు పట్టణంలో రైళ్ల రాకపోకల సమయంలో ట్రాఫిక్ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే, ఎన్‌హెచ్ మంత్రులతో సంప్రదించి ఆర్‌ఓబీల మంజూరుకు కృషి చేశారు. పీలేరు పట్టణంలో చిత్తూరు రోడ్డు, మదనపల్లె రోడ్డుకు రూ. 120 కోట్లతో రెండు ఆర్‌ఓబీలు మంజూరయ్యారు. రెండు చోట్లా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. నిర్మాణాలు పూర్తి అయితే ట్రాఫిక్ సమస్య తీరనుంది.

మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు..

- పీలేరు పట్టణం కావలిపల్లెలో రూ. 30 లక్షలతో పార్కు ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలకు ఆటవిడుపునకు ఇది ఎంతగానో దోహదం చేస్తోంది.
- స్థానిక కొత్తపల్లె రోడ్డులో చెరువును రూ. పది లక్షలతో అభివృద్ధి చేసి బోటింగ్, లైటింగ్, సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు.
- పీలేరు పట్టణాన్ని కలుపుతూ మదనపల్లె నుంచి తిరుపతికి రూ. 2400 కోట్లతో నాలుగు లేన్ల జాతీయ రహదారి పనులు చురుగ్గా జరుగుతున్నాయి.
- హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, ఆర్య వైశ్యులకు వేర్వేరుగా స్మశాన వాటికలకు స్థలం కేటాయించడంతోపాటు రూ.30 లక్షలతో మౌలిక వసతులు కల్పించారు.
- పట్టణంలో 40 ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు.
- మండలంలో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా 12 వేల ఇళ్లు మంజూరు చేశారు. మరో రెండు వేల ఇళ్ల పట్టాల పంపిణీకి లేఅవుట్ సిద్ధం చేశారు.

పీలేరును మరింత అభివృద్ధి చేస్తాం..



మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీలేరులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాము. పీలేరు పట్టణ ప్రజలు, వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా ఆర్‌ఓబీలు నిర్మించడంతోపాటు పీలేరుకు బైపాస్ రోడ్డు మంజూరు చేయించాము. పీలేరును అన్ని విధాలా మరింత అభివృద్ధి చేసేందుకు నావంతు సహాయ సహకారాలు ఉంటాయి.

- పి.వి. మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం..



గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యంగా పీలేరు ప్రభుత్వాస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు పెంచాం. ఇక్కడ ఓపీకి తగినట్లు అన్ని అత్యాధునిక సౌకర్యాలతో వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. పీలేరు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని వంద పడల ఆస్పత్రి పూర్తి చేశామని చెప్పడానికి గర్వపడుతున్నాం.

- చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే, పీలేరు

ఎంపీకి రుణపడి ఉంటాం..



పీలేరు పట్టణంలో మదనపల్లె రోడ్డు, చిత్తూరు రోడ్డులో రైళ్ల రాకపోకల సమయంలో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ట్రాఫిక్ సమస్య తెలుసుకున్న ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కేంద్ర మంత్రులతో మాట్లాడి రెండు ఆర్‌ఓబీలు మంజూరు చేయించారు. పనులు చురుగ్గా జరుగుతున్నాయి. త్వరలో సమస్య పరిష్కారం కాబోతోంది. ఎంపీకి రుణపడి ఉంటాం.

- బోదేషావలి, ఆటో యూనియన్ నాయకుడు

ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి..



గత ప్రభుత్వం పీలేరు అభివృద్ధి విస్మరించింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు కార్యరూపం దాల్చాయి. పీలేరు పట్టణం అభివృద్ధి తోపాటు పలు గ్రామీణ రోడ్లకు మహర్దశ కలిగింది.

- కంభం సతీష్‌రెడ్డి, ఎంపీపీ, పీలేరు


కావలిపల్లెలోని పార్కు


చురుగ్గా సాగుతున్న నాలుగులేన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు

గుర్రంకొండ విద్యార్థినికి రాష్ట్రస్థాయి బహుమతి

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్‌కు చెందిన హర్షిత అనే విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ఫెన్సింగ్(కత్తిసాము) కాంస్య పతకం సాధించినట్లు పీడీ రమేష్ తెలిపారు. ఇటీవల రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-19 ఆటలపోటీలు నంద్యాలలో నిర్వహించారు. మంగళవారం హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా, ఉపాధ్యాయులు త్రినాథ్, పీడీ రమేష్, కోచ్ రవీంద్ర విద్యార్థినిని అభినందించారు.

ఆంధ్ర అండర్ 15 క్రికెట్ జట్టుకు ఎంపిక

వాల్మీకిపురం : వాల్మీకిపురం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా క్రికెట్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న రుక్సార్ తబసుమ్ ఆంధ్ర అండర్ 15 క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు సబ్ సెంటర్ కోచ్ సునీల్‌కుమార్ తెలిపారు. ఈనెల 17 నుంచి బరోడా, గుజరాత్‌లో జరిగే బీసీసీఐ ఉమెన్స్ అండర్ 15 వన్‌డే ట్రోఫీలో పాల్గొంటుందని తెలిపారు. ఈమె ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఉమాదేవి, వీసీసీ సభ్యులు శ్రీధర్, ఖాదర్‌బాషా, నరేష్, భరత్, షాహెద్, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో గురుకుల పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

కలికిరి : జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ తెలిపారు. తిరుపతి జిల్లా తుమ్మలగుంటలో ఈ నెల 4న జరిగిన జిల్లా స్థాయి పోటీలలో అండర్-14 విభాగం లాంగ్‌జంప్‌లో నవపల్లవి ప్రథమస్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో జి.చరిత మూడవ స్థానం, షాట్‌పుట్‌లో బి.లావణ్య నాల్గవ స్థానం పొందారని తెలిపారు. అండర్-17 విభాగంలో జావెలిన్‌త్రోలో హైమావతి ద్వితీయ స్థానం, లాంగ్ జంప్‌లో కిరణ్మయి, ట్రిబుల్ జంప్‌లో మాధవి మూడవ స్థానంలో, 800 మీటర్ల పరుగుపందెంలో ముత్యాలు నాల్గవ స్థానంలో నిలిచి ప్రతిభ చాటారన్నారు. వీరిని పాఠశాల సిబ్బంది అభినందించారు. పీఈటీ గీత పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీలకు పీవీసీ విద్యార్థులు

వాల్మీకిపురం : స్కూల్ గేమ్స్ బాస్కెట్ బాల్ పోటీల్లో విశేష ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి తెలిపారు. 7వ తరగతి విద్యార్థి పుజేత ఖాన్, 8వ తరగతి విద్యార్థి సమీర్ ఖాన్‌లు అండర్ 14 బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే 9వ తరగతి విద్యార్థి గిరిధర్, పదో తరగతి విద్యార్థి అరవింద్‌లు అండర్ 17 విభాగంలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. పదో తరగతి చదువుతున్న శివకుమార్ 1500 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరంతా స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాని తెలిపారు. క్రీడాకారులను హెచ్‌ఎం,ఉపాధ్యాయులు ఉషారాణి, నాగరాజ, అమరనాథరెడ్డి అభినందించారు.

ఉర్దూ పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

వాల్మీకిపురం : పట్టణంలోని నాయక్‌వీధిలోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, మైనార్టీ నాయకులు ఇలియాజ్, సైఫుల్లా కలెక్టర్ గిరీషాకు వినతిపత్రం అందించారు. మంగళవారం రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో కలసి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి లేఖను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో మాట్లాడుతూ పాఠశాలలో ఎనిమిదవ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారని, నలుగురు ఉపాధ్యాయులు పని చేస్తుండగా పని సర్దుబాటు ప్రక్రియలో ఇద్దరు ఉపాధ్యాయులను బదిలీ చేశారని తెలిపారు. దీంతో ముస్లిం మైనార్టీలకు చెందిన పిల్లలు చదివే పాఠశాలలో తరగతుల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతుందని వివరించారు. పని సర్దుబాటు ప్రక్రియలో ఈ పాఠశాల నుంచి బదిలీ చేసిన ఉపాధ్యాయుల బదిలీని నిలిపివేయాలని విన్నవించారు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తంకు కూడా వినతిపత్రం అందించారు. పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ సమస్యలపై కలెక్టర్, డీఈఓ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఘనంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే

మదనపల్లె సిటీ : మదనపల్లెలో మంగళవారం కొత్త ఇండ్లు ప్రాథమికోన్నత పాఠశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే ఘనంగా నిర్వహించారు. కొత్త ఇండ్లు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ రాజగోపాల్ మాట్లాడుతూ స్కౌట్స్ సేవలను వివరించారు. విద్యార్థులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విజయవాడ నుంచి వచ్చిన విద్యార్థులకు చతుర్థ చరణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్కౌట్స్ మాస్టర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అనిత, ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ స్కౌట్స్,గైడ్స్ ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండర్ బెడన్ పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్కౌట్స్, గైడ్స్ చేస్తున్న సేవల గురించి స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి శకుంతలమ్మ వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, మోహన్‌వల్లి, అధ్యాపకులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్కౌట్స్ ట్రూప్ ప్రారంభం

వాల్మీకిపురం : స్థానిక ప్రభుత్వ పీవీసీ ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం భగత్‌సింగ్ స్కౌట్స్ ట్రూప్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమరనాథ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కౌట్ ఉపాధ్యాయుడు రవీంద్రారెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయులు రమణప్ప, నాగరాజు, వసుమతి, కల్పలత, ఉషారాణి, పురుషోత్తం పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

ములకలచెరువు: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలించేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్‌ఐ గాయత్రి తెలిపారు. మంగళవారం రాత్రి పాత ములకలచెరువులో పోలీసులు పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ జూదాలు జరిగితే సమాచారం అందించాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు.

మిట్స్‌లో ఈవీఎంల 'స్ట్రాంగ్' రూమ్‌లు

కురబలకోట : రానున్న ఎన్నికల దృష్ట్యా తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి ఆరు మండలాల ఈవీఎంల భద్రత, రిసెప్షన్ కేంద్రం ఏర్పాటుకు కురబలకోట మండలం అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలను ప్రతిపాదించినట్లు హెచ్‌ఎస్‌ఎస్ డిప్యూటీ కలెక్టర్, ఈఆర్‌ఓ రాఘవేంద్ర తెలిపారు. కళాశాలలో కట్టుదిట్టమైన రెండు స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించినట్లు తెలిపారు. తహసీల్దార్ ఎం. భీమేశ్వరరావు, కళాశాల పీఆర్‌ఓ మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద ఘటనపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లికి చెందిన కాంతమ్మ (62) అనే మహిళ మంగళవారం తన ఇంటి ముందు చెత్త శుభ్రం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇదే గ్రామానికి చెందిన పెద్ద వెంకట్రమణ అనే వ్యక్తి ట్రాక్టర్ నడుపుతూ ప్రమాదవశాత్తు ఆమెను ఢీకొన్నాడు. కాంతమ్మకు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను తిరుపతి ఆసుపత్రికి తరలించారు.

క్రీడాదుస్తుల ఆవిష్కరణ

తంబళ్లపల్లె : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్-14 బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న దుస్తులను వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డిలు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 9, 10, 11 తేదీలలో జరిగే ఈ పోటీలలో 13 జిల్లాల బాల, బాలికలు పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంత, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు తెలిపారు.

చెకుముకి పోటీలు

వాల్మీకిపురం : జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్సు టాలెంట్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ కల్పన కోరారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చెకుముకి పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడారు.

వడ్డెరల చైతన్యసభను విజయవంతం చేయండి

పీలేరు రూరల్ : పీలేరు వేర్‌హౌస్ గోడౌన్ ఆవరణలో బుధవారం నిర్వహించనున్న వడ్డెరల చైతన్యసభను విజయవంతం చేయాలని ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజమ్మ కోరారు. మంగళవారం వడ్డెర చైతన్య సభ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరం

పీలేరు : క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరమని డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. మంగళవారం తలపుల పీహెచ్‌సీలో జాతీయ క్యాన్సర్ అవగాహన కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, ఎంపీహెచ్‌ఈఓ శ్రీను, పర్యవేక్షకులు కుసుమ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం కార్యక్రమం

రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నారాయణస్వామి తెలిపారు. జిల్లా కలెక్టర్ హాజరవుతారన్నారు.

బహిరంగ వేలం

నవంబరు నెల తేదీలు : 08", 15" & 22.11.2023

Veh. No.	Vehicle Description	Year
AP39MF2450	TAFE 241	2013
AP03CV3700	TAFE 241	2019
AP03TE2876	TATA ACE MEGA	2015
AP39CU-2988	TAFE 241 PD	2019
AP03TD3270	TAFE 241	2015
AP39V9125	TAFE MF 241	2019
Ap03TB2914	AL DOST	2012

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.,

డి.నెం. 19-3-13/3, 1వ అంతస్తు, హోండా షోరూమ్ దగ్గర, రేణిగుంట రోడ్డు, తిరుపతి-517501, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 0877-2221287, మొబైల్: 9000080798

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తమదనపల్లె : పేదల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మండలంలోని కొత్తవారిపల్లె-2 దుబ్బిగానిపల్లె పంచాయతీ, నేతాజీకాలనీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, ప్రతి కుటుంబానికి అందిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని, పరిష్కరించాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఇలాగే కలకాలం కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. త్వరలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు అలవిగాని హామీలను గుప్పించి ఎలాగైనా అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నాడన్నారు. మోసగించేందుకు ఆయనతో పాటు దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్‌ను తోడు తీసుకుని ఇద్దరూ కలిసి ప్రజలను ఏమార్చేందుకు వస్తున్నారన్నారు. మనసున్న ప్రభుత్వాన్ని, మంచి చేసిన జగనన్నను ప్రజలు ఎప్పటికీ మరచిపోరని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా మళ్లీ వైఎస్సార్‌సీపీని అత్యధిక స్థానాల్లో గెలిపించి, ప్రజానాయకుడిని సీఎంగా చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ జి.వెంకటరమణ, డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెలుగుచంద్ర, మండల కన్వీనర్ దండు కరుణాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోతబోలు నాగరాజ, ఎంపీటీసీ ప్రియాంక, సుధాకర తదితరులు పాల్గొన్నారు.


గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మీటర్ రీడింగ్ స్కాన్ చేయాల్సిందే

బి.కొత్తకోట : ప్రతిఇంటికి వినియోగమైన విద్యుత్ వివరాలను కచ్చితంగా స్కాన్ చేయాల్సిందేనని చిత్తూరు డిస్కం మీటర్స్ ఏడీఈ గంగాధరం అన్నారు. విద్యుత్ వినియోగంపై రీడింగ్ తీసే విషయంలో చేతితో యూనిట్ల వివరాలు రాయడం, కొన్నిచోట్ల సరైన విధంగా యూనిట్ల వివరాలు నమోదు చేయకపోవడంపై గంగాధరం బృందం మంగళవారం బి.కొత్తకోటలో గృహ వినియోగ మీటర్లను పరిశీలించారు. ఏఈఈలు రామలక్ష్మన్, గిరిధర్, మదనపల్లె ఏఏఓ కిరణ్‌కుమార్, జేఏఓలు బావాజాన్, రెడ్డెప్పలు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి గృహ మీటర్లను తనిఖీ చేశారు. కొన్నిచోట్ల రీడింగ్ తీయకపోవడం, కొన్నిచోట్ల స్కానింగ్ లేకుండానే రీడింగ్ నమోదు చేసినట్లు గుర్తించారు. ఇకపై ఇలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జయచంద్రకు సూపర్ ఎక్సలెన్సీ జోన్ చైర్‌పర్సన్ అవార్డు

పీలేరు రూరల్ : పీలేరుకు చెందిన పామిడి జయచంద్రకు సూపర్ ఎక్సలెన్సీ జోన్ చైర్‌పర్సన్ అవార్డు లభించింది. మదనపల్లెలో జరిగిన వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ సమావేశంలో డిస్ట్రిక్ట్ వీ211ఏ గవర్నర్ విలలూరి వెంకటేష్‌బాబు ఆయనకు అవార్డు అందజేశారు. తనకు అవార్డు రావడానికి సహకరించిన వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ నాయకులు శ్రీరాములు, నాగలక్ష్మీలకు జయచంద్ర కృతజ్ఞతలు తెలిపారు.



క్లుప్తంగా

రేపటి నుంచి మాసుంవలి దర్గా ఉరుసు

కలకడ : కలకడ మండలం దండుబీడు ఇందిరమ్మ కాలనీలోని మాసుంవలి దర్గా (షహీద్ స్వాముల) వారి ఉరుసులో ప్రజలంతా పాల్గొనాలని ధర్మకర్త జి.అన్వర్‌బాషా కోరారు. 9వ తేదీ గురువారం గంధం, 10వ తేదీ శుక్రవారం ఉరుసు నిర్వహిస్తారన్నారు.

కలికిరి క్లస్టర్ ఏపీడీ బదిలీ

కలికిరి : డ్వామా కలికిరి క్లస్టర్ ఏపీడీ మధుబాబును తంబళ్లపల్లి క్లస్టర్‌కు బదిలీ చేస్తూ జిల్లా డ్వామా పీడీ మద్దిలేటి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే తంబళ్లపల్లి క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వై.నందకుమార్‌రెడ్డిని కలికిరి క్లస్టర్ ఏపీడీగా బదిలీ చేశారు.

కందిలో సస్య రక్షణ చర్యలు

కలికిరి : కంది పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలని డీఆర్‌సీ ఏడీఏ ఎంపీ శ్రీకాంత్, కేవీకే శాస్త్రవేత్త పీరూసాహెబ్ తెలిపారు. మండలంలోని పత్తేగడ గ్రామంలో కంది పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ లోకేష్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యా సదస్సు

కేవీపల్లె : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం గ్యారంపల్లెలో విద్యాసదస్సు నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిలా ట్రెజరర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లు - ఉపాధ్యాయుల కర్తవ్యంపై చర్చించనున్నట్లు తెలిపారు.

టపాసుల దుకాణాల వద్ద జాగ్రత్తలు పాటించాలి

పీలేరు : టపాసుల దుకాణాల వద్ద సరైన జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ ధనుంజయలు, సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ట్రాన్స్‌కో, ఫైర్, రెవెన్యూ, పోలీస్ అధికారులు, దుకాణదారులతో సమావేశం నిర్వహించారు.

పోలీస్ స్టేషన్‌లో దసరా సంబరాలు

కలికిరి : స్థానిక పోలీస్ స్టేషన్‌లో వాల్మీకిపురం సీఐ సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం దసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆయుధపూజ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రహీముల్లా, ఏఎస్‌ఐ మధుసూదనాచారి, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : కార్తీకమాసం పురస్కరించుకుని 22న శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 22న మదనపల్లె నుంచి సూపర్ లగ్జరీ బస్సు ఉదయం 5.30 గంటలకు బయలుదేరి నందలూరు, ఒంటిమిట్ట, దేవుని కడప దర్శించుకుని శ్రీశైలానికి రాత్రికి చేరుకుంటుందన్నారు. 23న శ్రీశైలం నుంచి మహానంది, యాగంటి, అహోబిళం దర్శించుకుని రాత్రి 12 గంటలకు మదనపల్లె చేరుకుంటుందన్నారు. 9959225676, 7382875034, 9440858510 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అర్హులందరికీ ఆరోగ్యశ్రీ

కలకడ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ పథకం వర్తించేలా ఆరోగ్యశ్రీకార్డును విధిగా అందజేయాలని ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డిలు ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని కె.బాటవారిపల్లె సచివాలయం పరిధిలోని వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత వలంటీర్ మొదలు ఉన్నత స్థాయి అధికారుల వరకు ఉందన్నారు.

బాల్యవివాహాలు చేయరాదు

రామసముద్రం : బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత తెలిపారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో ఎంపీడీఓ నారాయణస్వామి అధ్యక్షతన బాల్యవివాహాల నిర్మూలన సమావేశం జరిగింది. డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ సుధాకర్‌రెడ్డి, ఎంఈఓలు హేమలత, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు

తంబళ్లపల్లె: వైద్య సిబ్బంది సహకారంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటరామయ్య అన్నారు. మంగళవారం ఆస్పత్రిలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించి ఆస్పత్రికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు విక్రాంత్‌రెడ్డి, రిచర్డ్స్, తేజస్విని, సుమలత, హెడ్‌సిస్టర్ గ్లోరీ లిటిల్‌ఫ్లవర్, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

నిమ్మనపల్లె : బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. ఈనెల 15న విజయవాడలో నిర్వహించనున్న ప్రజారక్షణభేరిని జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం నిమ్మనపల్లెలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మతతత్వ అజెండాను అమలుచేస్తూ, రాజ్యాంగాన్ని కాలరాసి, మనువాదాన్ని అమలుచేయాలని చూస్తోందన్నారు.